క్లుప్తంగా

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



తెలకపల్లి: మండల కేంద్రంలో నెహ్రూ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిల చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు, రైతులు మంగళవారం పాలాభిషేకం చేశారు. ప్రభుత్వం రైతు భరోసా రెండు ఎకరాల్లోపు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతులకు వానాకాలం పెట్టుబడుల కోసం అవసరం వస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, నిరంజన్, అనంద్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 25 వాహనాలున్నాయని, ద్విచక్ర వాహనం కోసం రూ.5వేలు, మిగతా వాహనాల కోసం రూ.20 వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వేలంలో వాహనాలు రానివారికి డబ్బులు తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ చెల్లించి అచ్చంపేట ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలని వారు కోరారు.

రేపు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక

బిజినేపల్లి: స్పోర్ట్స్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల కోసం గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపికలు ఉంటాయని మండల విద్యాధికారి రఘునందన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఆధార్‌కార్డు, బోనఫైడ్‌లు దరఖాస్తు ఫారాలతో హాజరు కావాలని సూచించారు.

రైతుభరోసా దరఖాస్తుకు 20న చివరి తేదీ

తిమ్మాజిపేట: ఇప్పటి వరకు రైతుభరోసా రాని రైతులు, కొత్తగా పాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతుభరోసా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు 20వరకు గడువు ఉందని వ్యవసాయ విస్తరణ అధికారులు సాయిరాం, శివసాగర్‌లు తెలిపారు. రైతు భరోసా దరఖాస్తు ఫారమ్, పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో తిమ్మాజిపేటలోని వ్యవసాయ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

బాలుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



కోడేరు: మండల కేంద్రానికి చెందిన బాల్‌నాగయ్య కుమారుడు యశ్వంత్ అనారోగ్యంతో ఎంఎన్‌జే ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు.

ప్రమాదంలో మహిళలకు గాయాలు

తెలకపల్లి: బస్ ప్రమాదంలో ఇద్దరు మహిళలకు గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. అచ్చంపేటకు డిపోకు చెందిన ఆర్టీసీ బస్ సోమవారం ఉదయం తెల్లవారుజామున అచ్చంపేట నుంచి లింగాల మీదుగా హైదరాబాద్ వెళ్తూ తెలకపల్లి సమీపంలోని పెట్రోల్ బంకు సమీపంలో కల్వర్టు నిర్మించిన బ్రిడ్జి వద్ద బస్సు ఒక్కసారిగా ప్రమాదానికి గురైంది. కల్వర్టు వద్ద రోడ్డు కుంగిపోవడంతో బస్సు ఎగిరేసింది. దీంతో బస్సులో ఉన్న గౌరమ్మ, అంజనమ్మలకు గాయాలయ్యాయి. గాయపడిన మహిళలను 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగులు

బిజినేపల్లి: మండలంలోని ప్రయాణ ప్రాంగణంలో ఉన్న ఏటీఎంను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. సోమవారం అర్ధరాత్రి దుండగులు ఏటీఎంలోకి చొరబడి ధ్వంసం చేస్తున్న సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ విషయమై సీసీ కెమెరాలను పరిశీలించి దొంగతనానికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

అవగాహన పెంచుకోవాలి

తిమ్మాజిపేట: వాతావరణ నిర్ధారణ, నీటి సంరక్షణపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్ పిలుపు నిచ్చారు. మండలంలోని రాళ్ల చెరువు తండాలో మంగళవారం నాబార్డు వారి సహకారంతో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ గోవర్ధిని, కోఆర్డినేటర్ జగన్, రైతులు పాల్గొన్నారు.

సర్కారు బడి పిలుస్తోంది..

- పెరిగిన సదుపాయాలు, ఉత్తీర్ణత శాతం
- ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు
- విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యం
- గ్రామాల్లో ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం
- ప్రారంభమైన పాఠశాలలు



బలాన్‌పల్లిలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తాడూరు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా, గురుకులాలు, రెసిడెన్సియల్స్‌తో పాటు, పాఠశాలలను ఏర్పాటు చేస్తూ మెరుగైన విద్యను అందించే దిశగా సర్కారు అడుగులు వేస్తోంది. దీంతో ఇక్కడ చదువుకునే విద్యార్థులు అన్ని రకాల పరీక్షల్లో రాణిస్తున్నారు. తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

జోరుగా ప్రచారం..

గతంలో బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు నాయకులతో కలిసి గ్రామాల్లో పర్యటించే వారు. బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల మాదిరి ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, అభివృద్ధి, విద్యలో రాణించిన విద్యార్థులతో కూడిన కరపత్రాలను గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. నాయకులు, యువకుల సహాయంతో బడీడు పిల్లల తల్లిదండ్రులకు హామీ ఇస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను మెరుగ్గా తయారు చేస్తామంటూ ప్రచారం చేస్తున్నారు. అన్ని రకాల క్రీడలు, వారికి ఆసక్తి ఉన్నవాటిపై శిక్షణ ఇస్తామని ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గత ఏడాదికంటే ఈ సారి పెరుగుతోందని అంచనా వేస్తున్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మండలంలో పాఠశాలలు..

మండలంలో 6 ఉన్నత పాఠశాలలు, 1 కేజీబీవీ, ప్రాథమికోన్నత పాఠశాలలు 7, ప్రాథమిక పాఠశాలలు 24, 3 కాంప్లెక్స్‌లు తాడూరు, ఇంద్రకల్, సిర్సవాడలో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు.

మండలంలో విద్యార్థుల సంఖ్య..

1నుంచి 5వతరగతి వరకు 1201, 6నుంచి 10వతరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య 2042 ఉంది. ఈ ఏడాది బడి బాట కార్యక్రమం మే నెలలోనే ప్రారంభించారు. విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభించిన రోజే ఒక జత దుస్తులు, 6నుంచి 10 వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, 1నుంచి 5వరకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సెంటర్(కృత్రిమ మేధా) ద్వారా 30 మంది విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ ఆధారిత బోధన, ఈ సంవత్సరం మధ్యాహ్నం భోజనానికి ప్రతి పాఠశాలకు వంటపాత్రలు పంపిణీ చేశారు. వంట మాస్టర్లకు కేంద్ర ప్రభుత్వం రూ.1000తో పాటు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేలు కలిపి ప్రతినెల రూ.3వేలు వేతనం ఇస్తున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రతి పాఠశాలకు స్కావెంజర్‌ను నియమించి పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రం చేయించనున్నారు. వేసవి సెలవుల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు బోధన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు.

అందరి భాగస్వామ్యం అవసరం..



నాయకులు, యువత, ప్రజల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడం సాధ్యమవుతుంది. ఉపాధ్యాయులు గ్రామాల్లో కార్యక్రమాలు చేపట్టి తల్లిదండ్రుల కు అవగాహన కల్పించారు. పాఠశాలల్లో ఇప్పటికే కొత్తగా 100పైగా విద్యార్థులను చేర్పించారు.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

లింగాల: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఎ మ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండ లంలోని అంబట్‌పల్లికి సమీపంలో ఉ న్న నాయినోనిపల్లి దగ్గర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ని ర్వహించారు. ఈ సందర్భంగా పార్టీకి కార్యకర్తలు వెన్నెముక లాంటి వారని, నాయకులు, కార్యకర్తల భేదాభిప్రాయాలను విడనాడి సమన్వ యంతో పని చేయాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజల కు మధ్య పార్టీ శ్రేణులు వారధిగా ఉంటూ రాష్ట్ర ప్ర భుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రాథోడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివ, మాజీ వైస్ ఎంపీపీ నారాయణగౌడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ము క్తార్, ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ సభ్యులు జనార్దన్, ఇందిరమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మైసమ్మను దర్శించుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు

పెద్దకొత్తపల్లి: టీపీసీసీ ఉపాధ్యక్షులుగా పదవీబాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించండి



వల్లభాపూర్‌లో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ బషీర్ అహ్మద్



కోడేరులో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న రామ్‌లక్ష్మణ్

లింగాల: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ బషీర్ అహ్మద్ తల్లిదండ్రులను కోరారు. మండలంలోని రాంపూర్, వల్లభాపూర్, మానాజీపేటలో బడిబాటలో భాగంగా ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాలలోని పాఠశాలలను తనిఖీ చేశారు. కొత్త అడ్మిషన్లను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు

కోడేరు: మండల కేంద్రానికి చెందిన వడ్డెవాడ మాజీ వార్డు సభ్యులు రాధ, విద్యాకమిటీ చైర్మన్ రాంలక్ష్మణ్ సొంత ఖర్చులతో 1–5వ తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం, జగదీశ్వర్‌రావు, తిరుపతి, వీరస్వామి, సురేందర్‌రెడ్డి, హెచ్‌ఎం భువనేశ్వర్ పాల్గొన్నారు.

బాలికలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో మంగళవారం జెడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్‌హైస్కూల్, కస్తూర్బాలో మాజీ సర్పంచ్ కోట్ల సురేందర్‌గౌడ్ విద్యార్థినులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు సొంత ఖర్చులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని చక్కగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, ఎస్‌ఓ సువర్ణ, రఘు పాల్గొన్నారు.

ముగిసిన భూ భారతి రెవెన్యూ సదస్సులు



రాయిచేడ్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రమీల

ఉప్పునుంతల: మండలంలో ఈనెల 3 నుంచి 17వ తేదీ వరకు రెవెన్యూ అధికారులు గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులు ముగిశాయి. చివరి రోజు రాయిచేడ్, కాంసానిపల్లి గ్రామాల్లో భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని మొత్తం 22 రెవెన్యూ గ్రామాల్లో భూ సమస్యలపై 674 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ప్రమీల తెలిపారు. వచ్చిన దరఖాస్తులను రోజువారీగా ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు. వాటిలో ఆన్‌లైన్ రికార్డుల్లో సర్వే నెంబర్ మిస్సింగ్ కావడం, డీఎస్ పెండింగ్, సరిపడ భూమి లేకపోవడం, ఆసైన్డ్ భూములకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. దరఖాస్తులను పరిష్కారం చేసే దిశగా రైతులకు రశీదులు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సులలో తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ పరశునాయక్, ఎమ్మార్ఐ సుజాత, సీనియర్ అసిస్టెంట్ బాల్‌రాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల ఫిర్యాదులపై విచారణ చేసి పరిష్కరిస్తాం

బల్మూర్: రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి వచ్చిన భూ వివాదాలకు సంబంధించిన దరఖాస్తులపై విచారణ చేసి పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. మండలంలో జిల్లెలపల్లి రెవెన్యూ పరిధిలోని నర్సాయపల్లి, అనంతవరం గ్రామాల్లో ముగింపు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 668 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు కార్యాలయంలో మిస్సైన రైతులు తమ దరఖాస్తులు అందజేయాలన్నారు. 21వ తేదీ నుంచి నోటీసులు అందజేసి విచారణ చేసి ఆగస్టు 15వ తేదీ వరకు పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ కేశవ్, ఆర్ఐలు శివ, పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు చెక్కులు అందజేత



పెద్దకొత్తపల్లి: చంద్రబండతండాకు చెందిన లాలమ్మ, సునీతలకు ఇందిరమ్మ ఇళ్లను సబ్జలేవల్ వరకు నిర్మించుకోవడంతో లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులను మాజీ సర్పంచ్ రామ్‌లాల్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా నిర్మించుకుంటే పూర్తి స్థాయి బిల్లు రూ.5 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో పాండునాయక్, భాస్కర్‌నాయక్, రమేష్‌నాయక్, లాల్‌నాయక్, సక్రూనాయక్, గోవింద్‌నాయక్‌లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



తాడూరు: మండలంలోని పాపగల్, నాగదేవ్‌పల్లి గ్రామాలలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ ఏఈ రాజవర్ధన్‌రెడ్డి, ఎంపీఓ నర్సింహులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

సమాజంలోని అన్ని వర్గాలకు లయన్స్ క్లబ్ సేవలు



మాట్లాడుతున్న మహేందర్ కుమార్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా సామాజిక సేవలు అందిస్తూ చిరునామాగా మారిందని లయన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ మహేందర్ కుమార్ రెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్ ఆమనగల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న క్లబ్‌లలో ఆమనగల్ క్లబ్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. గతేడాది రూ.50 లక్షలతో సేవ కార్యక్రమాలు చేపట్టి 15వేల మందికి లబ్ధి చేకూర్చారన్నారు. అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా గంప శ్రీను, కోశాధికారిగా శ్రీనివాసరెడ్డి, ప్రచార కార్యదర్శిగా పాషాతో పాటు పలువురు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్లు జూలూరు రమేష్ బాబు, నరేందర్‌రెడ్డి, చెన్న కిషన్ రెడ్డి, డాక్టర్ దామోదర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ఉప్పల వెంకటేష్, గంప వెంకటేష్, భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, ఆనంద్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులను భవిత కేంద్రాల్లో చేర్పించాలి



చిన్నారులతో మాట్లాడుతున్న ఎంఈఓ ఇమ్మానుయేల్

కొల్లాపూర్: పాఠశాలలో చదువుకునే వయస్సు కలిగిన దివ్యాంగులను సమీప ప్రభుత్వ పాఠశాలలో లేదా భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈఓ ఇమ్మానుయేల్ సూచించారు. మంగళవారం ఆయన కొల్లాపూర్‌లోని భవిత కేంద్రాన్ని సందర్శించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమం ఏర్పాటు చేశారు. దివ్యాంగులైన చిన్నారులకు ఏర్పాటు చేసిన వసతి, సౌకర్యాలు ఎంఈఓ పరిశీలించారు. భవిత కేంద్రంలో వారానికి రెండుసార్లు ఫిజియోథెరపిస్టు ద్వారా చిన్నారులకు చికిత్స చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శోభారాణి, ఐఈఆర్‌టీ జయప్రకాష్ తదితరులున్నారు.

కేఎల్ఐ కాల్వ నిర్మాణానికి సహకరించాలి



బొల్లంపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ కార్తీక్‌కుమార్

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో కేఎల్ఐ కాల్వలో భాగంగా ఉప కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని తహసీల్దార్ కార్తీక్‌కుమార్ తెలిపారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. కేఎల్ఐ కాల్వలో భాగంగా డీ–82కాల్వ ఉప కాల్వ తవ్వకాలకు రైతుల భూములు ఇచ్చి సహకరించాలన్నారు. బొల్లంపల్లి రెవెన్యూ శివారులోని సర్వేనెంబర్ 71, 74, 89, 91, 92, 94, 95లలో మొత్తం 15 మంది రైతులకు చెందిన 7.34 గుంటల భూమిలో కాల్వ తవ్వకాలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ప్రభుత్వం నష్టపరిహారం గతంలో కంటే ఎక్కువ చెల్లించాలన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసేవిధంగా చూస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ సమ్మయ్య, ఆర్ఐ శంకర్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కొల్లాపూర్: కొల్లాపూర్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. హైదరాబాద్ సిటి సివిల్‌కోర్టులో ఇటీవల న్యాయవాదులపై జరిగిన కిడ్నాప్, దాడి ఘటనలను నిరసిస్తూ వారు విధుల బహిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పోతుల నాగరాజు మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. న్యాయవాదులపై దాడుల ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నిరంజన్, భాస్కర్‌రెడ్డి, నజీరొద్దీన్, వసంతరెడ్డి, శివారెడ్డి, మనోహర్, శ్రీహరి, మోహన్‌లాల్, రామలక్ష్మమ్మ, కురుమూర్తి, రాజేష్, రాఘవేంద్ర, ముబీన్, తదితరులున్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

లింగాల: మండలంలోని అప్పాయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా కొత్తగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి మాట్లాడుతూ 5 ఏళ్లలోపు పిల్లలను పూర్వ ప్రాథమిక విద్య కోసం అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాసులు ఇవ్వాలి

కొల్లాపూర్: గ్రామీణ ప్రాంత విద్యార్థులందరికీ ఉచిత బస్‌పాసులు ఇవ్వాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు ధార శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు బస్‌పాస్ చార్జీలను పెంచడం దారుణమన్నారు.ఇది పేద విద్యార్థులపై ఆర్థికభారం మోపడమే అన్నారు. మహిళలకు ఉచిత రవాణా కల్పిస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు మాత్రం ఎందుకు కల్పించడని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో మాసూంబాబా, సోహెల్, జయరాం, చింటు, శివ ఉన్నారు.

మొక్కల పెంపకం కార్యదర్శులదే బాధ్యత

తిమ్మాజిపేట: గ్రామాల్లో నాటిన మొక్కలను కాపాడుకోవడంలో పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ లక్ష్మీదేవి సూచించారు. మండలంలోని మరికల్ గ్రామంలో మంగళవారం నర్సరీని ఆమె పరిశీలించారు. గతంలో గ్రామ కంఠం పరిధిలో నాటిన మొక్కలను కాపాడేందుకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఉపాధిహామీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో, ప్రజల సహకారంతో పెంచాలన్నారు.

రుణమాఫీ చేయాలని ధర్నా

కోడేరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎన్నికల హామీలో భాగంగా రెండు లక్షల రుణమాఫీ చేయాలని మంగళవారం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు అందజేశారు. వెంకటస్వామి, పర్వత్‌రెడ్డి, కుర్మయ్య, శ్రీనివాసులు, నాగయ్య, సైదులు ఉన్నారు.

బీసీ వసతి గృహంలో మరుగుదొడ్ల నిర్మాణ పనులు

వెల్దండ: మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో స్నానాల గదులు, మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేపడుతున్నారు. కలెక్టర్ నుంచి మంజూరైన ప్రత్యేక నిధులు రూ.9లక్షలతో పనులు చేపడుతున్నట్లు వార్డెన్ శ్రీరామ్ తెలిపారు. వసతి గృహంలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు పేర్కొన్నారు.

కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: అంటరానితనం కుల వివక్షతపై జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి సోమవారం నిర్వహించాల్సిన పౌరహక్కుల దినాన్ని జరపడం లేదని, జీఓ నం.105, 128లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, రాజు, ధర్మయ్య, రాములు, మల్లికార్జున్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందించాలి

కల్వకుర్తి రూరల్: నియోజకవర్గంలోని రైతులకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి ప్రజల సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కా రం కోసం ఉద్యమిద్దామన్నారు. కార్యక్రమంలో ఏ పీ మల్లయ్య, పులిజాల పరుశరాములు, యాద య్య, సాయిలు, వెంకటయ్య, కృష్ణారెడ్డి, గున్నమ్మ పాల్గొన్నారు

నిర్మాణాలను పూర్తి చేయాలి



బల్మూర్: మండలంలోని వీరంరాజుపల్లి గ్రామ పంచాయతీని మంగళవారం ఎంపీడీఓ రాఘవులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు జాప్యం చేయకుండా ముగ్గులు పోసుకోని త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోనేలా అవగాహన కల్పించాలని కార్యదర్శి రమాదేవికి ఆయన సూచించారు. గ్రామంలో నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, చిన్నారులతో మాట్లాడి నిర్వహణపై ఎంపీడీఓ అంగన్‌వాడీ టీచరును అభినందించారు.

ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు నియంత్రించాలి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు పెంచిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు తారాసింగ్ మంగళవారం డీఐఈఓ వెంకటరమణకు వినతి అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో ఎలాంటి గుర్తింపు లేకుండా నడుపుతున్న జూనియర్ కళాశాలలను గుర్తించి వెంటనే వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

అచ్చంపేట రూరల్: ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను జలగల్లా పట్టి పీడిస్తున్నాయని ఓబీసీ సెంట్రల్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండికారి బాలాజీ అన్నారు. అచ్చంపేటలో వివిధ బీసీ సంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. పుస్తకాలు, టై, బెల్టుల పేరిట విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. వివిధ సంఘాల నాయకులు జగదీష్‌గౌడ్, శ్రీనివాసులు, ఆంజనేయులు, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

'మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడండి'

పెంట్లవెల్లి: మండల కేంద్రానికి వ్యాపార అవసరాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, మంగళవారం జరిగే సంతకు వచ్చే మహిళలకు టాయిలెట్స్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఉన్న టాయిలెట్స్‌ను మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ దేవేందర్‌కు వినతిపత్రం సమర్పించారు.